కథ

# జానకి కూతురు


పాలంకి సత్య



మా అమ్మ అన్నా ఆవిడ ప్రవర్తన అన్నా నాకు చాలా అసంతృప్తి. అందరి అమ్మలూ చక్కగా ఉద్యోగాలు చేస్తారు. లేదా సోషల్ వర్కు చేస్తారు. లేకపోతే క్లబ్బులకి వెళ్లి మీటింగుల్లో పాల్గొంటారు. మా అమ్మను చూసిన వాళ్లెవరూ కలెక్టరు భార్య అనుకోరు. ముఖం నిండా పసుపు కుంకం బొట్టూ, నేత చీరకట్టూ పల్లెటూరి పెద్దమ్మలా ఉంటుంది. అసలు మా నాన్న ఆవిడ నెందుకు చేసుకున్నారో. చిన్నప్పటి నుంచీ అనుకున్న మేనరికం కాదనలేక పోయారేమో.

ఈ కాలంలో పిల్లలని చక్కగా స్వీటీ అనో, పింకీ అనో పిలుస్తూంటే మా అమ్మ మాత్రం 'బంగారూ' అని పిలిచేది. సాయంత్రం ఫ్రెండ్స్‌తో ఆడుకుంటూంటే అమ్మ 'బంగారూ, లోపలికి రామ్మా. చీకటయిపోయింది' అంటే నాకు సిగ్గుగా ఉండేది. అసలు తనెందుకు వచ్చి పిలవాలి? ఇంట్లో ఎప్పుడూ ప్యూన్స్ ఉంటారు కదా. వాళ్లలో ఎవరినో ఒకరిని పంపిస్తే వాళ్లు వచ్చి ''అమ్మగారు పిలుస్తున్నారు'' అంటే నాకు ఎంత గొప్పగా ఉంటుంది? ప్యూన్స్‌ని ఇంట్లో వాళ్లలా చూసేది. అస్సలు స్టేటస్ మెయిన్‌టెయిన్ చేసేది కాదు.

నేనెప్పుడూ నాన్నతోనే ఉండేదాన్ని. నా టీ షర్టు మీద కూడా



'డాడీస్ గర్ల్' అని ప్రింటు చేయించుకున్నాను. నాన్నతో ''డాడీ, అమ్మ అలా ఉంటుందేమిటి? చక్కగా అందరూ మమ్మీలలా ఉండవచ్చు కదా. కలెక్టరు భార్యగా క్లబ్బులో కూడా గౌరవిస్తారు కదా. ప్రైజు డిస్ట్రిబ్యూషన్ చెయ్యచ్చు. ఈవిడ మా అమ్మ అనాలంటే నాకు సిగ్గు'' అనే దాన్ని. నాన్న చిరునవ్వు నవ్వే వారు. అమ్మని వెనకేసుకునీ రాలేదు. ఆవిడ ప్రవర్తన తప్పనీ అనే వారు కాదు.

నాకే ఎప్పటికైనా అమ్మని మార్చెయ్యాలని అనిపించేంది. నేను పెద్దయ్యాక పెద్ద ఉద్యోగం చేస్తాను. అమ్మా నువ్విలా ఉంటే నాకు అవమానంగా ఉంది. నువ్వు మారాలి అని చెప్తాను. అప్పుడు అమ్మ అందరూ అమ్మలలా ఉంటుంది అనుకునేదాన్ని.

ఒక రాత్రి అలాగే అనుకుంటూ పడుకుంటే ఫోను మోగింది. అంతా నిశ్శబ్దంగా ఉన్నప్పుడు మోగిందేమో ఉలిక్కిపడి అమ్మను వాటేసుకున్నాను. 'భయం లేదు బంగారు' అంటూ ఫోను తీసింది. అర్ధరాత్రి నిశ్శబ్దం మూలాన అమ్మ మాట్లాడుతున్నా నాకు కూడా వినిపించింది. అమ్మా అంటూ ఏడిచాను. అమ్మ నోట్లో అదే మాట 'భయం లేదు బంగారూ.'

నా ఏడుపు రెట్టింపయింది. భయం లేదా? ఎందుకు లేదు? భయం తప్ప ఏముంది? నాన్న లేకపోతే ఎలా? నాన్నను చూడకుండా ఉండగలనా? నేను నాన్న కూతుర్ని. నేను చచ్చిపోతాను. నాన్న దగ్గరకు వెళ్లిపోతాను.

ఏడవ సాగాను. అమ్మ నన్ను దగ్గరకు తీసుకుంది. ''బంగారూ! ఏడవ కూడదమ్మా. నువ్వేడిస్తే నాన్నకి బాధ కలుగుతుంది. నాన్న మంచి వారు. మంచివాళ్లంటే దేవుడి కిష్టం. అందుకే తన దగ్గరకు రప్పించుకుంటారు'' నాకు ఉక్రోషం వచ్చింది. ''నిన్నే రప్పించుకుని నాన్నని ఇక్కడ ఉంచేయవచ్చుగా. నువ్వేగా ఎప్పుడూ దేవుడికి పూజలు చేస్తావు. నువ్వెళ్లి నాన్నని నాకు పంపించెయ్యి''

అమ్మ నన్ను మరింత దగ్గరగా తీసుకుని వీపు నిమరసాగింది ఏడుస్తూ. ఏడుస్తూ కొంత సేపటికి నిద్రపోయాను.

మర్నాడు సాయంత్రానికి నాన్నని తీసుకొచ్చారు. అసలు గుర్తు పట్టలేకుండా ఉంది. నేను మీద పడి ఏడిచాను. బంధువులందరూ వచ్చారు. అత్తయ్యలూ మామయ్యలూ, పిన్ని అందరూ వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. అమ్మమ్మయితే ''అయ్యో, నీ బతుకు బుగ్గి అయిపోయిందే తల్లీ'' అంటూ ఏడవ సాగింది. అమ్మ మాత్రం నిశ్చలంగా కూచుంది. నాకు దుఃఖంతో పాటు కోపం కూడా వచ్చింది. ఈవిడ కెంతసేపు పూజలు పునస్కారలే. పాషాణ హృదయం. నాన్నంటే ప్రేమ ఉంటే కదా. ఇప్పుడింక ఇరవై నాలుగు గంటలూ పూజ చేసుకోవచ్చునను కుంటోందేమో.

నాలుగు రోజుల తర్వాత ఆఫీసు నుంచి కొందరొచ్చారు.

''మేడమ్, ఇప్పుడీ విషయాలు మీతో ఎలా మాట్లాడాలో తెలియడం లేదు. మీకు పెన్షన్, గ్రాట్యూటీ వంటివి శాంక్షన్ అవుతాయి. పేపర్లు సంతకం పెట్టించుకుందుకు వచ్చాం''

అమ్మ కాగితాలు తీసుకుని సంతకాలు పెట్టసాగింది.

''మేడమ్. మామూలుగా అయితే క్లర్క్ పోస్టు మాత్రమే ఇస్తారు. కానీ సార్ డ్యూటీలో మరణించారు. మీకు ప్రత్యేకంగా ఆఫీసరు ఫోస్టు మంజూరవుతుంది.''

అమ్మ సంతకాలు పెట్టడం ఆపి'' నాకు ఉద్యోగం వద్దు'' అంది.

నాకు దుఃఖస్థానంలో కోపం వచ్చింది. ఇప్పుడైనా అమ్మ ఉద్యోగం చెయ్యచ్చుగా. ఇంకా ఇంట్లోనే కూచుంటుందా?

''ఆలోచించుకోండి ఆరు నెలలటైముంది''

అమ్మ ఆలోచన మార్చుకోలేదు. ఆఖరుకి అమ్మమ్మ కూడా చెప్పి చూసింది. ''ఏదో ఒక వ్యాపకం పెట్టుకో. పిల్లని నేను చూసుకుంటాను''.

''పిల్లని కాదమ్మా. పిల్లలని అనాలి. నాకు మూడో నెల''.

***

ఆఫీసులో కూచుని ఫైల్సు చూస్తుంటే గతమంతా జ్ఞాపకం వచ్చింది. గతం జ్ఞాపకం రావడానికి కారణ ముంది. ఈ సీట్లోనే నాన్న పని చేశారు. ఆయన సంత కాలున్న ఫైల్సు ఇంకా ఉన్నాయి. అమ్మది రాతిగుండె. ఒక్కసారైనా ఏడవ లేదు. నాకూ, నాన్న పోయాక పుట్టిన తమ్ముడికీ ఏం కోరితే అది ఇచ్చింది. ఒకసారైనా ఇలా చేయండి అని చెప్పలేదు. అందరూ ఇంజనీరింగ్ చదివే రోజుల్లో నేను బి.ఏ. చదువుతానంటే సరేనంది. తమ్ముడు మిలటరీలో చేరతానంటే సరేనంది. ఎవరే మైతే ఏమిటి అన్నంత నిర్లక్ష్యం. భర్త పోతేనే ఏడవనిది ఇంక దేనికి ఏడుస్తుంది. దేనికి బాధపడుతుంది?

గతం తాలూకు జ్ఞాపకాల నుండి బయటపడి ఫైల్సు చూడసాగాను. విజిటర్స్‌ని చూసే సమయ మైంది. ఒక్కొక్కరే వస్తున్నారు. వాళ్ల సమస్యలు విని ఫైల్సుపై ఆర్డర్స్ వెయ్యసాగాను.

చివరగా ఓ పెద్దాయన వచ్చారు. గ్రామ సర్పంచి ఆయన. పంచాయతీ భవనానికి రిపేరు కోసం డబ్బు మంజూరుకి వచ్చారు.

ఫైలు చూసి డబ్బు మంజూరు చేయమని రాశాను.

ఆయన కృతజ్ఞతలు చెప్పారు కానీ కదలలేదు.

ఇంకేమిటన్నట్టుగా చూశాను.

''అమ్మా మీరేమీ అనుకోకపోతే అడుగుతాను. మీ ఇంటి పేరుని బట్టి అనుమానమొచ్చింది. మీ నాన్నగారు వేణుగోపాలరావు గారా?''

నాకు చిరాగ్గా ఉంది. అయినా పెద్ద వారు కదా అని ''అవును'' అన్నాను.

''అయితే నువ్వు మా జానకి కూతురివన్న మాట''

ఇదేమిటి ఈ ఏకవచన ప్రయోగం!

''చూస్తూనే అనుకున్నాను. ఆ ముక్కు కళ్లూ అచ్చం మీ అమ్మవే. ఎంతో మంచి పిల్ల. ఎవరికే కష్ట మొచ్చినా ఊరుకునేది కాదు. సాయం చేయాల్సిందే. అపకారం మాటే తెలియదు. ఉపకారమే. ఆఖరికి నీళ్లల్లో పడ్డ చీమ కనబడ్డా తీసి గట్టుకు వేస్తే కాని కదలేదికాదు. నీదీ ఆ పోలికే. అందుకే పది సార్లు తిప్పించుకోకుండా ఫైలు మీద సంతకం పెట్టేవు''

నేను నిర్ఘాంతపోయాను.

''మీ అమ్మగురించి ఎంతచెప్పినా చాలదు. భగ వద్గీత ఏడువందల శ్లోకాలూ మొత్తం కంఠతా వచ్చు. పోటీకి పంపించాలి అని అప్పటి స్కూలు హెడ్మాస్టారు అనుకున్నారు. కానీ మీ అమ్మ ఇష్టపడ లేదు. చదువు ఆచరణకి కాని ప్రదర్శనకా'' అంది.

నేను అవాక్కైపోయాను.

''ఇన్నాళ్లకి మా జానకి కూతుర్ని చూశాను. బస్సుకి టైమైందమ్మా. ఈసారి వచ్చినప్పుడు జాన కిని చూస్తానని చెప్పు''.

ఆయన నాకు నమస్కారమో, ఆశీర్వాదమో తెలియనిది పెట్టి వెళ్లిపోయారు.

***

ఇంటికి వచ్చాను. ప్యూను ''అమ్మగారు గుడికె ళ్లారు'' అని చెప్పాడు. వంటావిడ కాఫీ తెచ్చి ఇచ్చింది.

ఎందుకో తెలియదు. కానీ అమ్మ పూజగదిలోకి వెళ్లాను. దేవుడి దగ్గర పుస్తకాలు పెద్దబొత్తిగా ఉన్నాయి. నాన్న పోయినప్పటినించీ రామకోటి కాబోలు రాస్తూనే ఉంది. ఎన్ని పుస్తకాలు అయి ఉంటాయి అన్న కుతూహలంతో లెక్కపెట్టబో యాను. ఆ పుస్తకాల దొంతర పడిపోయింది. మొదటి పుస్తకం తెరచుకుంది. మూసెయ్యబోతూ చూశాను. రామకోటి కాదు. మామూలు రాతే.

అనుకోకుండా చదివాను.

అమ్మ నాన్నగారికి రాసుకున్న ఉత్తరమది. ''ఊహ తెలిసినప్పటినించీ బావే భర్త అన్న భావం నెలకొంది. మీరే ప్రాణంగా బతికాను. ఈనాడు మీరులేరన్న భావం భరించలేను. కాని నేను ఏడుస్తూ కూచుంటే పిల్ల ఏమవుతుంది? పుట్టబోయే సంతానం ఏమవుతుంది? అందుకే కన్నీరు కళ్లలోనే దాచుకున్నాను. మీ ప్రతి రూపాల కోసం బతుకుతాను''.

''నాకు ఉద్యోగమిస్తామన్నారు. చేయవచ్చు. కానీ నాకు పిల్లలకీ పెన్షను సరిపోతుంది. ఒక నిరుద్యోగికి ఉద్యోగమొస్తే ఒక కుటుంబానికి ఆధారం ఏర్పడుతుంది''.

''ఈ రోజు అబ్బాయికి 104 డిగ్రీల జ్వరం వచ్చింది. మీరు దక్కలేదు. పిల్లాడైన దక్కు తాడా అని భయమేసింది. భయాన్నీ, కోపాన్నీ, రాగాన్ని జయించమని గీతలో ఉంది. నాలాంటి సామాన్య రాలి కది సాధ్యమా?''

ఉత్తరాలు చదువుతుంటే నా కళ్లు కన్నీళ్లతో మసకబారాయి. నాన్నని మనసులోనే నిలుపు కుని, ఆయన తనతో ఉన్నట్లే ఊహించుకుంటూ అమ్మ జీవిస్తోందా? ఇన్నేళ్లుగా బడబానలాన్ని దాచు కుని అమృతం పంచిందా? గేటు తీసిన చప్పుడైంది. అమ్మ లోపలకు వస్తూ బంట్రోతుతో ''ఇంటికి వెళ్లలేదేమిటి? మీ అబ్బాయికి వంట్లో బాలే దన్నావుగా'' అంది.

గుమ్మం దాకా వస్తూ దారిలో ఆగి వంగుంది. నత్తని గుల్లతో సహా తీసి పక్కన గడ్డిలో పడేసింది. ఇంతకి మించిన జంతు ప్రేమ ఉంటుందా? సోషల్ వర్క్ చెయ్యలేదనీ ఉద్యోగం చెయ్యలేదనీ అను కున్నానే.

నేను డాడీస్ గర్ల్‌ని మాత్రమే కాదు. జానకి కూతుర్ని కూడా.

నా హోదాని పూర్తిగా మర్చిపోయి ''అమ్మా'' అంటూ పరిగెత్తాను. అయిదేళ్ల పాపలా ఆమె గుండెల్లో తలదాచుకున్నాను.

*

**చిరునామా:**
**పాలంకి సత్య,**
**301, విష్ణు రెసిడెన్సీ, సి బ్లాకు, గాంధీనగర్,**
**హైదరాబాద్ - 500 080**



## అలిగిన జెనీలియా....

**టాలీవుడ్,** బాలీవుడ్‌తో పాటు కోలీవుడ్‌లో కూడా జెనీలియా పలు సినిమాలు చేసింది. టాలీవుడ్ నుంచి బాలీవుడ్‌లో బిజీ అయిన తరువాత కోలీవుడ్ సినిమాలను బాగా తగ్గించుకుంది. ఇటీవల ఆమెతో సినిమా చేయడానికి ఓ తమిళ నిర్మాత సిద్ధపడగా రెమ్యూనరేషన్ దగ్గర తేడా వచ్చి ఆ సినిమాను వదులుకుంది. బాలీవుడ్‌లో ఆమె తీసుకుంటున్న పారితోషికాన్ని ఇవ్వడానికి ఆ నిర్మాత సిద్ధపడక పోవడంతో కోపం వచ్చి ఆ సినిమాను చేయనని మొహం మీదే చెప్పిందట! కోలీవుడ్‌కి ఐశ్వర్యారాయ్ వచ్చినా ఇంతకన్నా ఇవ్వలేని పరిస్థితులు ఉండగా, జెనీలియాకు అంత మొత్తం ఎలా ఇస్తామని ఆ నిర్మాత వాపోతున్నాడు. పూర్ ఫెలో!